

# టేకిట్ ఈజీ!!

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



నెలకో ఎపిసోడ్ రెడీ..జీ..

ఎవరేమన్నా..ఏదేమైనా టేకిట్ ఈజీ..!

## శనివారం నాది...కాదు

చిన్నప్పటి మాట.

**"అమ్మా ఇవాళేం వారం?"** కళ్ళు నులుపుకుంటూ అడిగేవాణ్ణి మంచమ్మీంచి.

**"శ..ని...వా..రం".** అమ్మ సమాధానం.

అంతే.. ఆ మాట వినంగానే గబగబా పళ్ళుతోమేసి, తలంటోసుసుకుని, తయారైపోయి వీధిగుమ్మంలో కూర్చునేవాణ్ణి. కాంపులనించి రాత్రి తొమ్మిదింటికొచ్చే నాన్నగారికోసం, పొద్దున్న ఎనిమిదింటినించీ ఎదురుచూపులు. ఇదే సందని నాచేత అన్ని పనులూ చేయించేసుకునేవారు ఇంట్లోవాళ్ళు, అద్దెకున్నవాళ్ళూను.

**"ఒరేయ్ శీనాడూ, గబగబా అన్నం తినెయ్యాలి, లేపోతే నాన్న ఇంకా లేటుగా వస్తారు"** అమ్మ.

**"శీనూ, గుణింతాలు దిద్దమ్మా, లేకపోతే నాన్నాఫీసుకి ఫోనుచేసి చెప్పేస్తాను.."** అమ్మే.

**"శీనూ, ఈ సూదిలో దారం ఎక్కించమ్మా, కనపట్టంలేదు.."** సుందరం అమ్మమ్మగారు.

**"ఒరేయ్, శీనూ, ఈ నాలుగు కూడికలూ చేసేయ్, అప్పుడు మనం వైకుంఠపాళీ ఆడుకుందాం..నాన్నగారొచ్చేలోపులో "** మధ్యాన్నం బడినించి వచ్చాకా రాంబాబు, అంటే అన్న.

**"శీనూ, నువ్వూ అన్నా కలిసి కాస్త గోరింటాకు కొయ్యండ్రా, మీనాన్నొచ్చేసరికి మీ చేతిలో చందమామా, వేళ్ళకి టోపీలూ పెడతాను.."** పక్కింటి బాచత్త.

ఇల్లా మనచేత సమస్తమైన పనులూ చేయించుకునే సరికి మనం రాత్రి భోజనం కూడా చేసేసి, ఆ గుమ్మందగ్గరే పడుకుంటే, రాత్రి నాన్న వచ్చి, ఎత్తుకుని లోపలికి తెచ్చి పడుకోబెట్టేవారు. అలా శనివారం మనక్కాకుండా పోయింది చిన్నప్పుడు.

అందుకని పెద్దయ్యాకా ప్రతీ శనివారం తెగ ఎంజాయ్ చేసేయాలని డిసైడ్మెంటయిపోయా. కానీ ఏం లాభం, నొసట్న దేవుడు మరోలా రాస్తేను. ఏంచెప్పమంటారు, కడుపు చించుకుంటే కార్పెట్ మీద పడుతుంది. అయినా ఏదో సందర్భమొచ్చింది కాబట్టి చెబుతున్నాను. ధర్మరాజుని జూదానికి పిలిస్తే టెంప్టు అయిపోతాట్ట, అల్లాగే నేను ఎవరన్నా టెన్నీసుకి పిలిస్తే కాదనలేను. ఇంకో ముగ్గుర్ని ఇబ్బందిపెట్టడం ధర్మం కాదు కదా. అంచేత శనివారం పొద్దు అల్లారం పెట్టుకుని మరీ లేస్తాను ఆరింటికల్లా. తరవాత జరిగే బాగోతం మీరే చూడండి...

* * * * * *

పళ్ళు గెట్టిగా తోమితే ఆ చప్పుడుకి పిల్ల లేస్తుందని మెల్లగా ఎడ్వటైజుమెంటువాడిలా తోమేసి, సెక్యూరిటీ అల్లారం ఆపేసి, అడుగులో అడుగేసుకుంటూ బెడ్రూం తలుపు తీసా. గోదారిగట్టమ్మటి అరటి చెట్లకిమల్లే మా రెండు శాల్తీలూ పూర్తిగా ఓ పక్కకి వాలిపోయి పడుకున్నాయి. నేనిలా గది బైటికి అడుగుపెట్టానో లేదో లోపల్నించి సవుండొచ్చింది..

**"నా...న్నా..".**

**" చచ్చాన్రా దేవుడా.. "** అనుకుంటూ లోపలికెళ్ళా.

జుట్టంతా మొహమ్మీదుండటంవల్ల తెలియలేదుగానీ, అది ఖచ్చితంగా నాకూతురే అయివుంటుందనే నమ్మకంతో అడిగా **"ఏమ్మా..ఏంకావాలీ ?"**

**"నాన్నా, ఓ మాటు నడ్డి గోకు.."** అని వెనక్కి తిరిగింది. చిర్రెత్తుకొచ్చింది. అయినా అవసరం మనది కాబట్టి, **"సరే, ఎక్కడా..."** అంటూ వీపు గోకి మళ్ళీ పడుకోబెట్టాను.

**"అర్రెడీ సన్ వచ్చేసాడు నాన్నా "** అని నసుగుతూంటే, ఇంక లాభంలేదని బ్రహ్మాస్త్రం ప్రయోగించా..

**" అవును, త్వరగా లే. స్కూలుకి లేటయిపోతోంది.."**

స్కూలు మాట వినగానే దుప్పట్లోకి దూరిపోయి, **"జస్ట్ టెన్ మోర్ మినిట్స్.."** అనేసి నిద్దర్లోకి జారిపోయింది నా కూతురు. మన ప్రతిభకి మురిసిపోతూ, కోర్టుకొచ్చి అందరిచేతా అక్షింతలేయించుకుని, ఆటమొదలెట్టేసరికి, అప్పుడిదాకా లేని వాన టెలిగ్రామిచ్చి పిలిచినట్టు వచ్చేసింది. సరే కాసేపు మౌనంపాటించి తిరిగొచ్చేసాను. వచ్చేసరికి మా పిల్ల రెడీగావుంది, పాలుతాగేసి. రిక్షావాడి డ్యూటీ మొదలు. దాన్ని **"కూర్మా మేథ్"** క్లాసుకీ, **కూచిపూడి** క్లాసుకీ తిప్పి, రిక్షా ఇంటికొచ్చేసరికి పన్నెండు. స్నానం చేసి, అగరొత్తి వెలిగించేసి కంచంలో పడ్డాను. మావిడికాయ పప్పు **(విత్ గార్లిక్)** , గోల్డ్స్పాట్ రంగులో వేగిన బంగాళదుంపలూ. ఇంకేం, **ఎన్టీయారూ, శ్రీదేవీ** లాంటి కాంబినేషన్ కదా , కుమ్మేద్దాం అని చెయ్యి తడిచేసుకుంటున్నాను.

**"నాన్నా, నాకు ఉత్తన్నంలో నెయ్యివేసి కలుపు."** .

**"అబ్బా, అమ్మ కలుపుతుంది..".**

**"నో, నువ్వే కలపాలి, నువ్వే...నువ్వే.."** .

అది ఓసారి కమిటైతే వదలని ఆడ పోకిరి కాబట్టి, నేనే లేచి, దాని సీటు దెగ్గరకెళ్ళి, అన్నం కలిపి, సీటు దగ్గరికి జరిపి, వచ్చేప్పుడు ఎందుకన్నా మంచిదని సెల్ఫోన్లు రెండూ ఆపేసి, వచ్చి భోజనం చేసా. పొద్దున్నించీ పడ్డ కష్టమంతా, పెరుగూ అన్నంలోకొచ్చేసరికి మర్చిపోయా. అదేం చిత్రమో, పక్కన కూర్చున్న మా ఆవిడా, ఎదురుగా కూర్చున్న మా పిల్లా మసక మసకగా

కనపడ్డం మొదలెట్టారు. " ఆ చెయ్యేస్తే, కడిగి తీసుకొస్తా.." ఈ సారి కాస్త గెట్టిగా అంది మా ఆవిడ. అప్పుడు చూసా, నేను కుర్చీలోనే జోగుతున్నా. "పద నాన్నా, పడుకుందాం.." అంది నా కూతురు. మరో రెండు నిమిషాల్లో ఇంకో శాల్తీ వంటిల్లు శుభ్రం చేసేసి పెద్దపక్క ఎక్కేసింది. నేను నా కూతుర్నేసుకుని దాని గదిలోకి నడిచా. శనివారాల మధ్యాహ్నం మాత్రమే దాని గదిలో పడుకుంటుంది మా ప్రిన్సెస్. సరే, దాన్ని పక్కెక్కించి, దుప్పటీ కప్పి , మారూంలోకెళ్ళబోయా. "నాన్నా, ఓ ఖత చెప్పు.." . ఇంక తప్పదని మొదలెట్టా.

"అనగా అనగా లటుకు, చిటుకు..".

"నో..అది చాలా చిన్న ఖత..నాకు పే.....ద్ద ఖత కావాలి..".

"సరే, అనగా అనగా ఒక పే...ద్ద రాజ్యం. ఆ రాజ్యానికి ఒక అందమైన ఒక ప్రిన్సెస్ ఉంది. దానికి బాగా నిద్దరొచ్చేసింది వచ్చేసింది, వచ్చేసింది.." అంటూ హిప్నాటిజం ట్రై చేసా. నిజంగానే వచ్చేసింది. దానిక్కాదు, నాకు. అలా, అదీ పనిచెయ్యలేదు.

"నాన్నా, నాకు కిష్ణుడూ, కుచేలుడూ కథ చెప్పు..." . అంది. నాకు కళ్ళు పడిపోతున్నాయి. ఆవులిస్తూనే మొదలెట్టా.

"అళగా అళగా సాందీపళి ఆశ్రమంలో , కిష్ణుడూ, బలరావుడూ, సుదాముడూ ఉన్నాళు."

"సుదాముడంటేనే కుచేలుడు కద నాన్నా..".

"కరెక్ట్ తల్లీ. అప్పుడూ..." అంటూ ఏదో చెబుతున్నాను. నోరాడుతోంది, పెదాలు కదులుతున్నాయి. సవుండొస్తోంది, బుఱ్ఱే.. పని చెయ్యట్లేదు. ....................

..."అప్పుడు విభీషణుడు ఒక లేడి లా వచ్చి, ఆశ్రమం నించి, సీతని ఎత్తుకుపోయాడు.." .

"నా..న్నా..." ఒక్క గిల్లు గిల్లింది నా కూతురు. అప్పుడు ఈ లోకంలోకొచ్చా. తప్పు గ్రహించి, నాలిక్కరుచుకుని, " ఆ....అప్పుడు కుచేలుడి వైఫు అటుకులు దంచి, పులిహోర చేసి, నిమ్మకాయ పిండి, పల్లీలు వేయించి వేసి, ఇంగువపోపు పెట్టి, నంచుకుందుకు కొంచెం బెల్లం ఆవకాయ వేసి, ఓ లంచి బాక్సులో పెట్టి , కిష్ణుడికిమ్మని పంపింది. ద్వారకలో భటులు కుచేలుణ్ణి లోపలికెళ్ళనియ్యలేదు. అంతే, కుచేలుడికి కోపం వచ్చి, లంచి డబ్బా మూత తీసాడు. అద్దిరిపోయే ఆవాసన పీల్చి, కిష్ణుడు పరిగెట్టుకుంటూ బైటికొచ్చేసి, కుచేలుణ్ణి లోపలికి తీసికెళిపోయాడు. రెండ్రోజులతరవాత కుచేలుడికి బోల్డన్ని డబ్బులూ, బంగారం, నగలూ అన్నీ ఇచ్చి పంపించారు. అప్పుడు ఆ..అటుకుల పులిహోర ఎలా చెయ్యాలో నేర్చుకోడానికి, రుక్మిణీ, కిష్ణుడూ కూడా కుచేలుడింటికి వెళ్ళారు..." ఇంక నావల్ల కాలేదు. మెల్లిగా పక్కకి చూసా. కిష్ణుడి మహిమ వల్ల నాకూతురుకి నిద్రపట్టేసింది. మెల్లిగా లేచి మా రూముకొచ్చా. లోపల పక్కమీద అటుపక్క నరకాసురవధ సీనులో సత్యభామ స్టిల్ ఫోటోలా ఉంది పడుకున్న మా ఆవిడ, ఆవిడ తాలూకు జడా.

సరే, ఇంక నేనూ నడ్డి వాల్చాను. ఐదునిమిషాలయ్యిందో లేదో..ఫోను గయ్యిమంది. ఎత్తి చూస్తే ఎవడో ఫెయిర్ టాక్ వాడట. ఇండియానించి. వాడి యాస చూస్తే శుద్ధ అగ్రహారం యాస. పేరు మాత్రం డెన్నిస్ అట. సరే వాడు మాట్టాడ్డం పూర్తయ్యాకా, "యుగాట్ రాంగ్ నంబర్, దిసీజ్ అబ్రహాం లింకన్.." అనేసి ఫోనుపెట్టేసాను. మరో పావుగెంటలో కాస్త కునుకుపడుతోందనగా మరో ఫోను.." హెళ్ళో..గాయత్రీ, దిసీజ్ చిత్ర కాళింగ్ ఫ్రం ఫెయిర్ టాక్.." అంటూ పదినిమిషాలు అరవంలో చితగ్గొట్టేసింది... వినీ వినీ విసుగెత్తి, ఆవిడ గేప్ ఇచ్చినప్పుడు "నాన్ ఉంగళై కాదలిక్కిరేన్..." అనేసి ఓ ముద్దిచ్చేసి ఫోను పెట్టేసా. మరో ఇరవై నిముషాలకి మళ్ళీ ఫోను. ఇంక నావల్ల కాలేదు. వాణ్ణి బండబూతులు తిడదామని ఫోనెత్తాను. "హలో సర్, నాపేరు రాజేష్ సర్. మీరు వంద డాలర్లు

ఖర్చుపెడితే మాకు వంద రూపాయలొస్తాయి సర్, తమ్ముడి చదువు సర్, చెల్లి పెళ్ళి సర్, అర్థం చేసుకోండి సర్ " అంటూ సినిమా హీరో ఉదయ్‌కిరణ్ మాడ్యులేషన్‌లో చెప్పేసరికి కాదనలేక ఓ మాట చెప్పా.." నాయనా, నీ ఎడ్రసు నాకిస్తే, నెలకి వెయ్యిరూపాయల చెక్కు పంపుతాను.. దయచేసి ఇన్ని సార్లు "సార్" అంటూ ఫోను చెయ్యకు. " ఫోను పెట్టేసాను. అప్పటికే నిద్ర చెట్టెక్కేసింది. మళ్ళీ ఫోను మోగింది. ఇంక నా సహనం చచ్చిపోయింది.

"హలో సర్. దిసీజ్ దిలీప్ ఫ్రం ఫెయిర్ టాక్.." .

"హితుడా, ఆగాగు. హేమంటివి, హేమంటివి, కాలింగ్‌కార్డ్ అమ్ముదువా? నాకింకొక ఉపాయమ్ము తోచుచున్నది. నేను ఇండియాలో మావాళ్ళ నెంబర్లిచ్చెదను, నీవే కాన్ఫరెన్స్ కాలు కలుపుము. నీకు తేరగా వచ్చినదే కదా. ఏల వందా, వందా అని వందసార్లడిగెదవు, అయిననూ వందకేమివచ్చుచున్నది. నీరా, కాదే, బీరా, రాదే? ఇది డాలరు పరీక్షయేగాని, రుపీస్ పరీక్ష కాదే కాదూ..కాకూడదు.."

ఇలా ఓ అరగంట గుక్కతిప్పుకోకుండా దొబ్బేసరికి అటు " ఆరోగ్యశ్రీ" వారి వేను "కుయ్యి కుయ్యి" మంటూ మోగిన శబ్దం వినబడింది. ఇంక రోగం కుదిరినట్టే అని రిసీవరు పెట్టేసాను.

ఇంతలో మాపిల్లా, సత్యభామా లేచి రెడీ అవుతున్నారు. సాయంత్రవేదో హౌస్ వార్మింగుట. రాత్రి భోజనాలక్కడేనట. హాయిగా శనివారం నాడు ఏ ఉప్మా పెసరట్టో చేయించుకుని , అల్లం పచ్చడి నాలిక్కి తగిలేలా తిందామంటే, ఈ దిక్కుమాలిన పార్టీల గోలొకటి. అయినా నాకు తెలియకడుగుతాను, హౌస్ వార్మింగుకి ఇంత హడవిడెందుకు, హీటర్ ఆన్ చేసుకుంటే పోలే.

* * *

అయ్యా విన్నారుగా, ఇల్లా శనివారాలు వచ్చీ వెళ్ళిపోయీ.. ఏళ్ళు గడిచిపోతున్నాయి. మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు గారు చాలా అదృష్టవంతులు. అందుకే ధైర్యంగా చెప్పారు "శనివారం నాది" అని. మనకా ప్రాప్తం లేదేమో. ఏం చేస్తాం, నలుగురితోటీ నారాయణా....

****